శ్రీరామ నవమి ఉత్సవాలకు హరీశ్‌రావుకు ఆహ్వానం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

సిద్దిపేట, మార్చి 31: సిద్దిపేట నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో నిర్వహించనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆలయ నిర్వాహకులు ఆహ్వానం పలికారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును నంగునూరు మండలం నర్మేటలోని రామాలయం, సిద్దిపేట పట్టణం హరిప్రియనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం, పంచముఖ హనుమాన్ ఆలయం, గణేశ్‌నగర్‌లోని ప్రసన్నంజనేయ స్వామి ఆలయం, శ్రీరామరాజు రావి చెట్టు హనుమాన్ ఆలయంలో జరిగే ఉత్సవాలకు రావాలని ఆలయ నిర్వాహకులు హరీశ్‌రావుకు పత్రిక అందజేసి ఆహ్వానం పలికారు.

టీ స్టాల్‌ను ప్రారంభించిన హరీశ్‌రావు

అనంతసాగర్‌లో టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, మార్చి 31: చిన్నకోడూర్ మండలం అనంతసాగర్‌లో టీ స్టాల్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

నంగునూర్, మార్చి 31: మండలంలోని గట్ల మల్యాల పరిధిలోని సీతారాంపల్లి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రాష్ట్ర అయిల్‌పాం అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి తండ్రి మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. మల్లారెడ్డి చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్, సీనియర్ నాయకులు మల్లయ్య, సురేందర్, కిష్టారెడ్డి, రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్ హయాంలోనే ముస్లింలకు పెద్దపీట

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

ప్రజ్ఞాపూర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, మార్చి 31: కేసీఆర్ ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు పెద్దపీట వేస్తూ, అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి పండుగల సమయంలో సహాయం అందించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రంజాన్ తోఫాను ఇవ్వడం లేదన్నారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో మైనార్టీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేసీఆర్, హరీశ్‌రావుల సహకారంతో షాపింగ్ కాంప్లెక్స్‌లను కోట్లాది రూపాయలతో నిర్మించుకున్నామన్నారు. ఆనాడు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లతో మసీదులకు కొత్త కళ వచ్చిందన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు అందించారన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న యాదవరెడ్డి, మాదాసు శ్రీనివాస్

కాంగ్రెస్ మైనార్టీలకు చేసింది శూన్యం

గజ్వేల్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 31: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీలకు రంజాన్ తోఫా ఇవ్వకుండా అన్యాయం చేసిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా గజ్వేల్, ప్రజ్ఞాపూర్, సంగాపూర్‌లలో ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తే, ఈ ప్రభుత్వం అందరిని విస్మరించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీపీసీ చైర్మన్‌గా విజయ్‌కుమార్

నూతనంగా ఎన్నికైన పీపీసీ కమిటీ

చేర్యాల, మార్చి 31: ఇండియా మిషన్ ఆస్తుల పరిరక్షణ కమిటీ(పీపీసీ) చైర్మన్‌గా అందె విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం చేర్యాల పట్టణంలో చేర్యాల పాస్టర్స్ ఫీల్డ్ అధ్యక్షుడు డేవిడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ గ్రామాల నుంచి సుమారు 40 మంది పాస్టర్స్, సంఘ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీపీసీ చైర్మన్‌గా విజయ్‌కుమార్‌తో పాటు 25 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కమిటీకి తెలియకుండా ఎలాంటి క్రయవిక్రయాలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

భూములు తమకే అప్పగించాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

బెజ్జంకి, మార్చి 31: గాగిల్లాపూర్ గ్రామ శివారులోని తోటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన భూమిని రిజర్వాయర్ రద్దు కావడంతో తిరిగి అప్పగించాలని రైతులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. సేకరించిన భూముల్లో కళాశాల ఏర్పాటు చేసేందుకు అధికారులు సర్వే చేసేందుకు వెళ్లగా విషయం తెలుసుకున్న రైతులు అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు. భూములు అప్పగించే విషయం కోర్టు పరిధిలో ఉన్నందు వల్ల ఈ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోరారు. రైతులు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సహదేవ్ పాల్గొన్నారు.

గజ్వేల్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

చేర్యాల పట్టణంలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి



తొగుట: వెంకట్రావుపేటలో ఈద్గా వద్ద ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 31: మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాలతో పాటు సలాఖపూర్, రేబర్తి, లద్నూర్, మర్మాముల, బైరాన్‌పల్లి, జాలపల్లి తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు.

తొగుట మండలంలో...

తొగుట, మార్చి 31: తొగుట మండల వ్యాప్తంగా సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరూ ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ఉమ్మడి మిరుదొడ్డిలో...

మిరుదొడ్డి, మార్చి 31: ఉమ్మడి మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అలయ్ బలయ్‌తో శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

చేర్యాలలో...

చేర్యాల, మార్చి 31: చేర్యాల పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నెల రోజులుగా ఉపవాసదీక్షలు చేపట్టిన ముస్లింలు సోమవారం ఉదయం రంజాన్‌ను పురస్కరించుకొని నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఖాజా ఈద్గా వద్దకు చేరుకొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కొమురవెల్లిలో...

కొమురవెల్లి, మార్చి 31: మండల వ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం ఉదయం వేకువజామునే స్నానం ఆచరించి కొత్త బట్టలు ధరించి ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దుబ్బాకలో...

దుబ్బాక, మార్చి 31: దుబ్బాక నియోజకవర్గంలో సోమవారం రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భారీ సంఖ్యలో ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. అలయ్-బలయ్ చేసుకొని, ఈద్ ముబారక్ తెలిపారు. ముస్లింలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక మజీద్ కమిటీ అధ్యక్షులు ఖలీల్, బీఆర్ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, కడతల రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భూంరెడ్డి పాల్గొన్నారు.

ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

హుస్నాబాద్ టౌన్, మార్చి 31: రంజాన్ వేడుకలు హుస్నాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈద్గాల వద్దకు ముస్లింలు పెద్ద సంఖ్యలో చేరుకొని, అక్కడ సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈద్గా వద్దకు వివిధ పార్టీల నాయకులు చేరుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, జామా మసీదు అధ్యక్షుడు ఎండీ బాషుమియా, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ అయూబ్, బీఆర్ఎస్ నాయకులు వాల నవీన్‌రావు, బొల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎండీ హసన్, అజీమ్, షబీర్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఐనాపూర్ ఈద్గా వద్ద రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు

కొండపాక మండలంలోని దుద్దెడలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొండపాకలో...

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 31: కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో సోమవారం ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు సోమవారం నూతన వస్త్రాలు ధరించి ఆయా గ్రామాల్లో ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కోహెడలో...

కోహెడ మార్చి 31: కోహెడ మండల కేంద్రంతోపాటు శనిగరం, బస్వాపూర్, సముద్రాల తదితర గ్రామాల్లో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు నూతన వస్త్రాలను ధరించి మసీదు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు అలయ్ బలయ్ తీసుకున్నారు. కుటుంబ సమేతంగా సంతోషంగా గడిపారు. కార్యక్రమాలలో మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖధీర్, మైనార్టీ నాయకులు అబ్దుల్ రహీం తదితరులున్నారు.

మద్దూరులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మిరుదొడ్డి: అల్వాలలోని ఈద్గా వద్ద ముస్లింలు

వర్గల్: వేలూర్ ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

దుబ్బాకలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

హుస్నాబాద్ టౌన్: హుస్నాబాద్‌లోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హుస్నాబాద్ టౌన్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

రామాలయం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రామాలయం చైర్మన్ తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మార్చి 31: రామాలయం అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామాలయం చైర్మన్ తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా జరుపుకోవడానికి గ్రామ ప్రముఖులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చేతితో వొలిచిన వడ్లను తలంబ్రాలుగా స్వామివారి కల్యాణానికి తీసుకురావాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మహా శతచండీ యాగం కరపత్రాల ఆవిష్కరణ

ఆకునూరులో మహా శతచండీ యాగం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

చేర్యాల, మార్చి 31: మండలంలోని ఆకునూరు భవానీ రుద్రేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు లోక కల్యాణం కోసం నిర్వహించనున్న రుద్ర సహిత మహా శత చండీ యాగం కరపత్రాలను చేర్యాల జాక్ చైర్మన్ బైరవబట్ల చక్రధారి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రధారి మాట్లాడుతూ చేర్యాల ప్రాంతంలోని అన్ని గ్రామాలు సస్యశ్యామలం కావాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలనే సదుద్దేశంతో ఈ యాగాన్ని నిర్వహించేందుకు వేద పండితులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మహా శత చండీ యాగాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బైరవబట్ల కుటుంబ సభ్యులు, నాగిళ్ల శ్రీరామశర్మ, హరికృష్ణ కుటుంబ సభ్యులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం, ఏకానందం, ఉమారాణి, రఘువీర్, నాని, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వట్టికోట సేవలు చిరస్మరణీయం

కృష్ణామాచార్యులను సన్మానిస్తున్న అర్చకులు, సిబ్బంది

వర్గల్, మార్చి 31: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి ఆలయంలో ప్రధాన అర్చకులుగా సేవలందించి, సోమవారం పదవీ విరమణ గావించిన వట్టికోట కృష్ణామాచార్యుల సేవలు మరువలేనివని, ఆలయ అర్చకసంఘం, సిబ్బంది కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, నాలుగున్నర దశాబ్దాలుగా నాచగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులుగా, ప్రభుత్వ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా కొనసాగిసిన కృష్ణామాచార్యులు, తోటి ఉద్యోగులతోపాటు నాచగిరి క్షేత్రానికి వచ్చే భక్తులతో కూడా సన్నిహితంగా మెలిగారన్నారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, సిబ్బంది పాండు, నరేందర్‌గౌడ్, సంపత్, రవి, అర్చకస్వాములు జగన్నాధాచార్యులు, నాగరాజుశర్మ, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల పాలవుతున్న ధాన్యం

ట్రాక్టర్‌లో ధాన్యాన్ని తీసుకెళ్తున్న రైతులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 31: ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం దళారుల చేతిలోకి పోతుంది. తీవ్ర నీటి ఎద్దడితో అరకొరగా ఉన్న సాగునీటితో కష్టనష్టాలను ఓర్చుకొని పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు చేసేదేమిలేక దళారులు, మిల్లర్లకు నామమాత్రపు ధరలకు అమ్ముకుంటున్నారు. అకాల వర్షాల భయానికి కొంతమంది రైతులు ముందస్తుగా వరిని కోస్తున్నారు. ఇదే అదనుగా భావించి మిల్లర్లు తేమశాతం పేరిట తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2320 మద్దతు ధరను నిర్ణయించగా దళారులు, కొంతమంది మిల్లర్లు రూ.15 వందల నుంచి 18వందల వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు మద్దతు ధర అందే విధంగా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్ సర్కార్

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట, మార్చి 31: రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, నియంతృత్వ పాలన కొనసాగిస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అభిషేక్ భాను ఆరోపించారు. హెచ్‌సీయూలో భూముల వేలాన్ని అడ్డుకున్నందుకు విద్యార్థుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ సిద్దిపేట ముస్తాబాద్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టు చేసిన హెచ్‌సీయూ విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూముల వేలాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన విద్యార్థులపై లాఠిచార్జీ చేయడమే కాకుండా తీవ్రంగా గాయపర్చి అరెస్టు చేశారని ఆరోపించారు. తక్షణమే భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చేర్యాలలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేర్యాల, మార్చి 31: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వ వైఖరిని అడ్డుకున్నందుకు విద్యార్థులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నట్లు విమర్శించారు. యూనివర్సిటికీ సంబంధించిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు వేలం వేయడాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లెనిన్‌రాజు, సంజు, రాజు, భరత్, చరణ్, సాయికుమార్ పాల్గొన్నారు.

డ్రైవర్ ఆత్మహత్య

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 31: అప్పుల బాధతో టాటా ఏస్ మినీగూడ్స్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం అర్ధరాత్రి కొండపాక మండలంలోని దుద్దెడలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెడకు చెందిన రోడ్డ మల్లేశం(31) టాటా ఏస్ మినీగూడ్స్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం వాహనం టైర్ పంక్చర్ అయిందని ఇంట్లో నుంచి వెళ్లిన మల్లేశం రాత్రి ఇంటికి రాలేదు. కుటుంబీకులు వెతకగా మల్లేశం చిన్నబాపు లక్ష్మణ్ వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

PUBLIC NOTICE

That My client Naval Kishore, S/o. Purushotham Das Ladda, R/o. Mothi Nagar, Erragadda, he wants to purchase Land in Sy.No. 1417/B/1/1 extent of 883 Sq.yards, sitauated at Cherial Village and Mandal from the original owner Sri Kaleru Jeevan Sai, S/o. Srinivas, R/o. Ambeerpet. If any objections/quires approach Office.

THATIKONDA PRANEETH, Advocate, Cherial, Cell: 9618845878.

బహిరంగ ప్రకటన

నా కక్షయింట్లు శ్రీంద పేర్కొన్న షెడ్యూల్ ఆస్తిని శ్రీ కుంట్ల లక్ష్మారెడ్డి S/o. మల్లారెడ్డి నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సామాన్య ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. శ్రీ కుంట్ల లక్ష్మారెడ్డి శ్రీంద పేర్కొన్న షెడ్యూల్ ఆస్తిని శ్రీమతి గొల్లపల్లి సత్తమ్మ నుండి రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 4026/2009, SRO సిద్దిపేట రూరల్, తేది: 25-07-2009 ద్వారా కొనుగోలు చేసి, పూర్తి యాజమాన్య హక్కులతో మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పట్టాదారు పాస్‌బుక్ నెం. T10120180468 ద్వారా అనుభవదారు అయి ఉన్నారు.

కావున, షెడ్యూల్ ఆస్తి లేదా దానిలో కొంత భాగానికి సంబంధించి లేదా పైన పేర్కొన్న అమ్మకపు లావాదేవీకి సంబంధించి ఏదైనా అభ్యంతరం, దావా, ఆసక్తి లేదా వివాదం ఉన్న ఏ వ్యక్తి (లు) అయినా, ఈ ప్రమరణ తేదీ నుండి పది (10) రోజుల లోపు అట్టి అభ్యంతరాలనికి సంబంధించిన ఆధార పత్రాలను జతచేస్తూ దిగువ సంతకందారుకు వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను. లేనిచో, పేర్కొనబడ్డ స్థిరాస్తి యొక్క క్రయ విక్రయాలకు మరియు అనుభవ హక్కులకు సంబంధించి ఎవ్వరికున్ను ఎటువంటి అభ్యంతరాలు లేనట్లుగా పరిగణించబడును.

ఆస్తి షెడ్యూల్

తెలంగాణ రాష్ట్రం, సిద్దిపేట జిల్లా, కుకునూర్‌పల్లి మండలం, తిప్సారం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం. 341/ఉ/ఆ లో ఉన్న ఎకరం 1-04 గుంటలు మరియు సర్వే నెం. 342/ఉ/2లో ఎకరం 0-20 గుంటలు, పూర్తి విస్తీర్ణం ఎకరం 1-24 గుంటల దిగువ హద్దుల మధ్య ఉన్న వ్యవసాయి భూమి. ఉత్తరం: కొంగర శంకర రావు భూమి, దక్షిణం: దొడ్డి వెంటయ్య భూమి, తూర్పు: కొంగర శంకర రావు భూమి, పడమర: కన్నెబోయిన సత్తిరెడ్డి మరియు రామ్‌రెడ్డి భూమి.

Sd/- SUDHAKAR REDDY CHALLA, Advocate
Pramana Law Chambers, H.No. 8-2-601/P/27, Panchavati Colony, Road No. 10, Banjara Hills, Hyderabad, Telangana-500 034, **Cell: 9885511711.**